# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 76 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 08, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## 19న అలయ్ బలయ్ కార్యక్రమం

### హర్యానా గవర్నర్ దత్తాత్రేయ వెల్లడి



హైదరాబాద్,అక్టోబర్7(నమస్తే ఉదయం): అలయ్ బలయ్ ఒక సాంస్కృతిక కార్యక్రమమని, అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చేదని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. దసరా పండుగ సందర్భంగా బండారు దత్తాత్రేయ ప్రతి ఏటా నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించి సోమవారం మీడియాతో దత్తాత్రేయ మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించే అలయ్ బలయ్ కార్యక్రమం ఏర్పాట్లపై కమిటీతో చర్చించి పలు సూచనలు చేసినట్లు చెప్పారు. అలయ్ బలయ్ రాజకీయ కార్యక్రమం కాదన్నారు. ఈ కార్యక్రమం 19వ వసంతంలోకి అడుగుపెడుగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.



## మావోలపై ఉక్కుపాదం

- చివరి దశలో మావోల ఏరివేతలు
- ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణ
- తీవ్రవాదం అంతానికి కలిసి పనిచేద్దాం
- ఆయుధాలు వదిలేసిన 13 వేల మందికి పైగా మావోలు
- గరిజనులకు అభివృద్ధి పథకాలు చేర్చాలన్నదే లక్ష్యం
- మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో అమిత్ షా

న్యూఢిల్లీ,అక్టోబర్7(నమస్తే ఉదయం): మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సు దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు తీవ్రవాదం అంతం కోసం అన్ని రాష్ట్రాలు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా మావోయిస్టులు ఆయుధాలు వదిలేశారు. 2024లో 202 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 723 మంది లొంగిపోయారు. భవిష్యత్తులో మరింత స్ఫూర్తితో ఒకే లక్ష్యంతో ముందుకెళ్లాలి. ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తోంది. అక్కడ కొందరు మావోయిస్టులు లొంగిపోయారని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు మిగతా.. 2లో



ఏపీ సీఎం చంద్రబాబు వివాహ ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

## ఏపీ సీఎం చంద్రబాబును తన కూతురు శ్రేయ రెడ్డి వివాహానికి ఆహ్వానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రీ రాజశేఖర్ రెడ్డి తన కూతురు వివాహానికి ఆహ్వానించారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని ఏపీ సీఎం చంద్రబాబు మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి లత కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ నెల 27 వ తేదిన తన కుమార్తె శ్రేయరెడ్డి ఆదిత్యల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.

## వరదనష్టం పనులకు రూ.11,713.49 కోట్లు ఇవ్వండి



- రాష్ట్ర పునర్విభజన సమస్యలు పరిష్కరించండి..
- ఎల్‌డబ్ల్యూఈలో ఆ మూడు జిల్లాలను తిరిగి చేర్చండి...
- ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచండి..
- అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ,అక్టోబర్7(నమస్తే ఉదయం): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ బిజీ బిజీగా గడుపుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి పనులు, పెండింగ్ నిధులకు సంబంధించిన విషయాలపై డిస్కస్ చేసేందుకు వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఇందులో భాగంగానే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో



రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రక్షాళన, మూసీ సుందరీకరణకు సంబంధించిన వివరాలను ఖట్టర్‌కు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఖట్టర్‌తో భేటీకు ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన తెలంగాణకు వరద సహాయం పెంచి త్వరగా అందించాలని రేవంత్ అమిత్ షాను కోరారు. దీంతో పాటు మిగతా.. 2లో




## హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి..

- మెట్రో రైలు రెండో దశకు మద్దతు ఇవ్వండి...
- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ,అక్టోబర్7(నమస్తే ఉదయం): హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ఎలాన్ ను(సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. చారిత్రక హైదరాబాద్ నగరంలో పురాతన మిగతా.. 2లో

## మాల్దీవులకు భారత్ అండ

- అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు కు ప్రధాని హామీ
- ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి భేటీలో పలు చర్చలు



న్యూఢిల్లీ,అక్టోబర్7(నమస్తే ఉదయం): మాల్దీవులకు గతంలో మాదిరే భారత్ అండ ఉంటుందని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అన్ని రంగాల్లో అండగా ఉంటామని అన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ , మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు మధ్య సోమవారం ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. భేటీ అనంతరం ఇద్దరు నేతలు సంయుక్త ప్రకటన చేశారు. ఈసందర్భంగా మాల్దీవులతో భారత్‌కున్న చిరకాల స్నేహం గురించి మోదీ గుర్తు చేశారు. ద్వీప దేశానికి కష్టమొస్తే.. ఆదుకునే విషయంలో ముందుండే మిగతా.. 2లో

## వైద్యశాస్త్రంలో విశేష కృషి

## విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌లకు నోబెల్ పురస్కారం



స్టాక్‌హోం,అక్టోబర్7(నమస్తే ఉదయం): వైద్యశాస్త్రంలో విశేష కృషి చేసినందుకుగాను విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌లకు ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం వరించింది. మైక్రో ఆర్ఎన్ఏ, పోస్ట్ ట్రాన్స్‌క్రిప్షనల్ జీన్ రెగ్యులేషన్‌లో దాని పాత్రను కనుగొన్నందుకు గుర్తింపుగా పురస్కారం లభించింది. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో ఉన్న కరోలిన్‌స్కా మిగతా.. 2లో

## కాంగ్రెస్ తీసుకున్న ముఖాముఖిని కొనసాగిస్తాం

- ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతాం: తుమ్మల

హైదరాబాద్,అక్టోబర్7(నమస్తే ఉదయం): పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ తీసుకున్న కార్యక్రమాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళతామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. బీఆర్ఎస్ కావాలనే ప్రభుత్వంపై విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ రుణమాఫీలో ప్రపంచాన్ని మోసం చేసిందన్నారు. ఇప్పటికీ 22 లక్షల మందికి రైతు రుణమాఫీ చేశామని.. ఇంకా 20 లక్షల మంది రైతులకు మాఫీ చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పేర్కొన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. పార్టీ కార్యకర్తలు, సామాన్య ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. నేరేడు చర్ల మండలానికి సంబంధించిన భూమి విషయంలో యాదమ్మ అనే వృద్ధ మహిళ మంత్రికి ఫిర్యాదు చేసింది. దీనిపై వెంటనే స్పందించిన మిగతా.. 2లో

## మాది ముమ్మాటికీ ప్రజా ఎజెండా

- ప్రభుత్వానికి వ్యక్తిగత ఎజెండా లేదు
- చెరువుల, నాలాల ఆక్రమణలు తొలగించాల్సిందే
- గత పదేళ్లలో నగరం చుట్టూ చెరువుల ఆక్రమణలు
- మూసీ సుందరకీరణలో పేదలకు న్యాయం చేస్తున్నాం
- విమర్శలే ఎజెండాగా విపక్షాలు పనిచేస్తున్నాయి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




హైదరాబాద్,అక్టోబర్7(నమస్తే ఉదయం): తెలంగాణలో నాలాలు, చెరువులు అక్రమించి.. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపుతుంది. అందులోభాగంగా హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ హైడ్రాపై విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. హైడ్రా పేరుతో తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారంటూ విపక్షాలపై ఆయన మండిపడ్డారు. హైడ్రాపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అనేక అభివృద్ది కార్యక్రమాలపై అపోహాలు సృష్టిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసహనం వ్యక్తం చేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ.. ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనే మిగతా.. 2లో

## కాశ్మీర్, హర్యానాల ఫలితాలపై ఉత్కంఠ

- నేడు ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ,అక్టోబర్7(నమస్తే ఉదయం): జమ్మూ కశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం ఉదయం ప్రారంభం కానుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం సర్వం




సిద్ధం చేసింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతను సీఈసీ ఏర్పాటు చేసింది. అందుకోసం భారీగా బలగాలను మోహరించింది. మంగళవారం ఉదయం 8.00 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభ మవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. భద్రత చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులతోపాటు భద్రతా దళాలను మోహరించినట్లు తెలిపింది. అలాగే ఓట్ల లెక్కింపు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసినట్లు వివరించింది. తొలుత 7.30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామని స్పష్టం చేసింది. అనంతరం మిగతా.. 2లో



## సద్దుల బతుకమ్మ, దసరాలకు ప్రత్యేక బస్సులు

- సొంతూళ్లకు చేరే వారికి సహకరించాలి
- పోలీస్, రవాణాశాఖ అధికారులతో సజ్జన్నార్

హైదరాబాద్,అక్టోబర్7(నమస్తే ఉదయం): సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు టీజీఎస్ ఆర్టీసీకి సహకరించాలని పోలీస్, రవాణా శాఖల అధికారులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ కోరారు. గత దసరాతో పోల్చితే ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు వల్ల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముందని, గతంలో మాదిరిగానే సహాయసహకారాలు అందించాలని ఆయన కోరారు. సరా ఆపరేషన్స్‌పై హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో సోమవారం టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన పోలీస్, రవాణా శాఖ అధికారులతో సమన్వయ సమావేశం జరిగింది. దసరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యల గురించి వారికి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఆర్టీసీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ.. పండుగ సమయాల్లో మిగతా.. 2లో

# మావోలపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

రహితంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలు సహకరించాలని షా పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఛత్తీస్‌గఢ్ సీఎం, డీజీపీని ఆయన అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో మోదీ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. 'పదేళ్లలో 11,500 కిలోమీటర్ల మేర రోడ్ నెట్‌వర్క్‌తో పాటు 15,300 సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటుచేశాం. 165 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుచేశాం. గతంలో హింసాత్మక ఘటనలు 16,400కు పైగా జరిగాయి. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు 7,700లకు తగ్గాయని వెల్లడించారు. పౌరులు, భద్రతా బలగాల మరణాలు 70 శాతం తగ్గాయి. హింస ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు తగ్గాయి. హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసుస్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని అమిత్ షా పేర్కొన్నారు.హింస మార్గంలో ఏం సాధించలేమని.. జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హింస మార్గాన్ని వీడే మావోయిస్టుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుని ప్రజల్లోకి రావాలని మావోయిస్టుల కు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా సూచించారు. ఈ సమావేశంలో 2023, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజం అంతం, అర్బన్ నక్సల్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాలను కట్టడి చేయడంతో పాటు పోలీస్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర చాలా బాగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే వికసిత భారత్ సాధించాలంటే గిరిజనులు, ఆదివాసీలు సైతం అందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈనీ ప్రభుత్వ ఫలాలు గిరిజనులు, ఆదివాసీలకు అందకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా మండిపడ్డారు. రహదారులు, టవర్లు, చివరకు విద్య, వైద్యం సైతం వీరికి చేరనివ్వడం లేదన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టు సమస్యను ఎదుర్కొనే విషయంలో మోదీ సర్కార్ గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో తొలి సారి మావోయిస్టు హింస కారణంగా జరిగిన మరణాల సంఖ్య 100 కంటే తక్కువ నమోదయిందని వివరించారు. అలాగే మావోయిస్టుల ప్రభావిత గిరిజన ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ ఫలాలు, పథకాలు సైతం వేగంగా చేరుతున్నాయని తెలిపారు. మావోయిస్టుల సమస్యను అధిగమించేందుకు బహుముఖ వ్యూహాన్ని సైతం అమలు చేస్తున్నామన్నారు. దీంతో ఈ సమస్యను చాలా సమర్థవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు సైతం చాలా బాగా పని చేస్తున్నాయన్నారు. ఇక ఎన్‌కౌంటర్‌లలో గాయపడిన భద్రత బలగాలను త్వరితగతిన వైద్య చికిత్స అందించేందుకు హెలికాప్టర్ సేవలను వినియోగిస్తున్నామని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదంపై పైచేయి సాధించామని హోం మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు డీజీపీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే జార్ఖండ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మరోవైపు భవిష్యత్తులో వామపక్ష తీవ్రవాదం దేశానికి ముప్పుగా పరిణమిస్తుందని కేంద్రంలోని మోదీ సర్కార్ భావిస్తుంది. ఆ క్రమంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుక చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో దశాబ్దాల క్రితం నేపాల్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు పశుపతి టూ తిరుపతి కారిడార్ ఏర్పాటు చేసేందుకు మావోయిస్టులు ఉపక్రమించారు. అయితే దీనిని సైతం మోదీ సర్కార్ ధ్వంసం చేసిన విషయాన్ని ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు మావోయిస్టులు వార్షికోత్సవాలు జరపాలంటూ కేడర్‌కు పిలుపు నిచ్చింది. అలాంటి వేళ.. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 35 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాల్లోకి వెళ్లకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. ఇక దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిన సంగతి తెలిసిందే.



దేవుళ్ళ అవతారంలో పాత్రలు పోషించిన చిన్నారులు

## బుద్వేల్‌లో ఘనంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### ఆలరింపచేసిన భక్తి కార్యక్రమాలు

రాజేంద్రనగర్, అక్టోబర్ 7(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ శ్రీ వీరాంజనేయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీ దుర్గా మాత ప్రతిమ వద్ద శ్రీదేవి శరన్నవ



చిన్నారులతో స్థానిక మహిళలు

రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. సోమవారం ఉత్సవాలలో భాగంగా చిన్నారులు నిర్వహించిన కూచిపూడి కార్యక్రమం భక్తులను ఎంతో ఆలరింపజేసింది. చిన్నారులు వివిధ దేవతల అవతారాల వేషధారణలతో ఎంతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువజన సంఘం ప్రతినిధులు సురేష్ యాదవ్, నరేష్ యాదవ్, కిరణ్ యాదవ్, నిఖిల్ యాదవ్, అర్జున్ యాదవ్ ,సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# సద్దుల బతుకమ్మ, దసరాలకు ప్రత్యేక బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు టీజీఎస్ఆర్టీసీకి పోలీస్, రవాణా శాఖలు ఎంతగానో సహకరిస్తున్నాయని గుర్తు చేశారు. సంస్థ వృద్ధిలో పోలీస్, రవాణా శాఖల పాత్ర కూడా ఉందని అన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ప్రజలకు సూచించారు. టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తే తలెత్తే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగులకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం చేసింది. ఈ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 6304 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈ సారి మహాలక్ష్మి పథకం అమలు నేపథ్యంతో రద్దీ దృష్ట్యా గత ఏడాదితో పోల్చితే అదనంగా 600 స్పెషల్ సర్వీసులను తిప్పాలని నిర్ణయించింది. ఈ నెల 9 నుంచి 12 తేది వరకు అధిక రద్దీ ఉండే అవకాశముండటంతో.. ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతోంది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఎల్బీనగర్ ఆరాంఘర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, బోయిన్ పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్ సదన్, బొరబండ, శంషాబాద్ లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్ లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమించాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా వలంటీర్లనూ నియమించాం.' అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు, తదితర ప్రాంతాలకు బస్సులను నడిపేలా ఎలాన్ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా జేబీఎస్ నుంచి 1602, ఎల్బీనగర్ నుంచి 1193, ఉప్పల్ నుంచి 585, ఆరాంఘర్ నుంచి 451 అదనపు బస్సులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. తిరుగు ప్రయాణం రద్దీ ఎక్కువగా ఉండే ఈ నెల 13, 14 వ తేదిల్లోనూ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్ ను సంస్థ అధికారిక వెబ్ సైట్ బిణబసబిఞశిబీబ.తిని లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని సూచించారు. ప్రయాణికులు సమయాన్ని వృథా చేసుకోకుండా బస్సుల కదలికలను గుర్తించేందకు గమ్యం ట్రాకింగ్ యాప్ ను వినియోగించుకోవాలన్నారు. హైదరాబాద్ సిటీ అదనపు కమిషనర్(ట్రాఫిక్) విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. పండుగ వేళల్లో టీజీఎస్ఆర్టీసీకి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని అన్నారు. ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చడానికి టీజీఎస్ఆర్టీసీతో సమన్వయంగా పని చేస్తామని చెప్పారు. సమన్వయ సమావేశంలో సైబరాబాద్ జాయింట్ సీపీ(ట్రాఫిక్) జోయల్ డేవిస్, హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, అశోక్ కుమార్, రాచకొండ ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసులు, మనోహర్, ట్రాఫిక్ అదనపు డీసీపీలు వీరన్న, ఎండీ మాజిద్, రవాణా శాఖలకు చెందిన ఆర్టీఏలు వాణి, పురుషోత్తం రెడ్డి, సుభాష్ సి రెడ్డితో పాటు టీజీఎస్ఆర్టీసీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీవోవో) డాక్టర్ వి.రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ ఆర్ఎంలు శ్రీలత, వరప్రసాద్, కేఎస్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

# మాది ముమ్మాటికీ ప్రజా ఎజెండా

(మొదటి పేజీ తరువాయి)

తప్ప.. తమకు ఎలాంటి వ్యక్తిగత అజెండా లేదన్నారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి మాట్లాడారు. 2014 నుంచి 2023 మధ్య కాలంలో హైదరాబాద్, చుట్టు పక్క ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన చెరువుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులతో కలిసి భట్టి వివరించారు.ఇది ప్రజా ప్రభుత్వం..

పారదర్శకమైన ప్రభుత్వం. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లోని చెరువులు ప్రజల ఆస్తి అన్నారు. హైదరాబాద్ అంటేనే రాక్స్, లేక్స్, పార్క్స్. ఇవి హైదరాబాద్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయి. నగరంలో గత కొన్నేళ్లుగా చెరువులు మాయం అవుతున్నాయి. మూసీని ఆధునికీకరించాలని గతంలో చాలా ప్రయత్నాలు జరిగాయి. శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా చెరువుల ఆక్రమణలను గుర్తిస్తున్నాం అని భట్టి వివరించారు. రాష్ట్ర విభజన జరిగే నాటికి ఎన్ని చెరువులు ఉన్నాయి.. ఇప్పుడెన్ని ఉన్నాయి అనే వివరాలు సేకరిస్తున్నాం. హైడ్రాను తీసుకొచ్చింది సీఎం కోసమో, మంత్రుల కోసమో కాదు కదా. చెరువులు అన్యాక్రాంతం కాకుండా కొత్త నిబంధనలు తెచ్చుకున్నాం. చెరువులను భవిష్యత్ తరాలకు అందించాల్సి ఉందని భట్టి వివరించారు. ఇప్పటికైనా చెరువుల ఆక్రమణ ఆపాలి. మూసీలో మంచినీళ్లు లేకుండా డ్రైనేజీగా మార్చేశాం. గతంలో ఇతర దేశాల్లోనూ నదులు డ్రైనేజీల్లా ఉండేవి.. వాళ్లు మార్చుకున్నారు. ఇతర దేశాలు నదులను ఆస్తులుగా మార్చుకున్నాయి. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపక్షాలు అంటున్నాయి. టెండర్లే పిలవకుండా రూ.లక్షన్నర కోట్లు అవుతుందని ఎలా చెబుతారు? మూసీ సుందరీకరణ అంశంపై ప్రతిపక్షాలు తమ ఆలోచనలు మాకు తెలియజేయాలి. మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు ఎవరికీ ఇబ్బంది కలిగించం. ఇళ్లను తొలగించిన బాధితులకు వేరేచోట ఇళ్లు ఇస్తున్నాం. కూలగొట్టిన ఇళ్ల కంటే మెరుగైన ఇళ్లను ఇస్తున్నాం. ప్రజలకు మేలు జరగకూడదనేదే ప్రతిపక్షాల అజెండా. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా మార్చేందుకు ప్రతిపక్షాలు సలహాలు ఇవ్వాలి. పరిపాలనలో చిన్న చిన్న పొరపాట్లు జరిగితే సరిదిద్దుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం అని భట్టి అన్నారు. అలాగే నగరానికి మూసి నది మణిహారంగా మార్చాలన్నదే తమ లక్ష్యమని ఆయన తెలిపారు. నగరంలో చాలా చెరువులు, పార్కులు, కబ్జాకు గురయ్యాయన్నారు. ప్రజలకు మేలు చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా కబ్జాలతో హైదరాబాద్‌లో చెరువులు మాయమైనాయని అన్నారు. చెరువుల అక్రమణతో ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూసి నది పరివాహక ప్రాంతంలో అక్రమణలను సైతం రేవంత్ రెడ్డి సర్కార్ తొలగిస్తుంది. ఆ క్రమంలో పేదలు, మధ్యతరగతి వారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో విపక్షాలు సైతం స్పందించాయి. అందులోభాగంగా రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇక ఇదే అంశంపై మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ సైతం స్పందించారు. అందులోభాగంగా రేవంత్ రెడ్డికి ఆదివారం ఎంపీ ఈటల బహిరంగ లేఖ రాశారు. లేఖలో హైడ్రా పేరుతో రేవంత్ సర్కార్ దూకుడు మీద వెళ్తుందంటూ ఎంపీ ఈటల ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఇక బీజేపీ నేత, కేంద్ర మంత్రి బండి సంజయ్ సైతం హైడ్రాపై కీలక ఆరోపణలు చేశారు. మరో విపక్షం బీఆర్ఎస్ నేతలు అయితే.. హైడ్రా తీసుకుంటున్న నిర్ణయాలపై మండిపడుతున్నారు.ఈ క్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కపై విధంగా స్పందించారు.

# మాల్దీవులకు భారత్ అండ

(మొదటి పేజీ తరువాయి)

తొలి దేశం భారత్ అని పేర్కొన్నారు. దానిని నిర్ధరించేలా కొవిడ్ వ్యాక్సిన్ల సరఫరా, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సహాయం చేయడం గురించి ప్రస్తావించారు. మాల్దీవుల్లో రూపే కార్డుతో పేమెంట్ సేవలు ప్రారంభించి, తొలి లావాదేవీని మోదీ, ముయిజ్జు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ముందుగా ముయిజ్జు, మాల్దీవుల ప్రతినిధి బృందానికి నా ఆహ్వానం. మన బంధం శతాబ్దాల నాటిది. భారత్.. మాల్దీవులకు అతి దగ్గరి పొరుగు దేశం, సన్నిహిత మిత్ర దేశం. మా నైబర్‌హుడ్ పాలసీ, సాగర్ విజన్‌లో మాల్దీవులది కీలక స్థానం. ఈ దేశం కోసం స్పందించే దేశాల్లో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుంది. ఒక పొరుగు దేశంగా ఎల్లప్పుడూ మా బాధ్యతలు పూర్తిగా నిర్వహించాం. మన సహకారానికి వ్యూహాత్మక దిశానిర్దేశర చేసేలా అడుగులు వేస్తున్నాం. మాల్దీవుల ప్రజల ప్రాధాన్యాలకు మేం ఎంతో విలువిస్తాం. ఈ క్రమంలోనే ట్రెజరీ బిల్లుల విషయంలో ఉపశమనం కల్పించాం. మీ అవసరాలకు అనుగుణంగా.. 400 మిలియన్ల డాలర్ల, 3 వేల కోట్ల రూపాయల కరెన్సీ స్వాప్ అగ్రిమెంట్‌పై సంతకం చేశాం అని మోదీ వెల్లడించారు. అలాగే ఒక ఎయిర్ పోర్టు ప్రారంభించామని, 700 హౌసింగ్ యూనిట్స్‌ను నిర్మించి ఇచ్చామని చెప్పారు. పోర్టు నిర్మాణానికి మద్దతు ఇవ్వాలనే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. అడ్డు, బెంగళూరులో దౌత్య కార్యాలయాల ఏర్పాటుపై ఈ ఇద్దరు నేతలు చర్చించారు. ఈసందర్భంగా ముయిజ్జు మాట్లాడుతూ.. తమ దేశంలో పెట్టుబడులు పెంచేందుకు భారత్‌తో స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తున్నామని తెలిపారు. తమ టూరిజం మార్కెట్‌కు భారత్ అతిపెద్ద సోర్స్ వెల్లడించిన ఆయన.. భవిష్యత్తులో టూరిస్టుల సంఖ్య పెరుగుతుందనే ఆశాభావం వ్యక్తంచేశారు. వీరిద్దరూ ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భేటీ అయ్యారు.

# విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రవ్‌కున్‌లకు నోబెల్ పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌స్టిట్యూట్‌లోని నోబెల్ బృందం ఈ పురస్కారాలను ప్రకటించింది. వీరిద్దరూ అమెరికాకు చెందినవారే కావడం విశేషం. కొవిడ్-19 వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసినందుకుగాను హంగేరి అమెరికన్ కాటలిన్ కరికో, అమెరికాకు చెందిన డ్రూ వెయిస్‌మన్ లకు గతేడాది వైద్యశాస్త్రంలో నోబెల్ వచ్చింది. వైద్యశాస్త్రంలో మొత్తంగా ఇప్పటివరకు నోబెల్ బహుమతిని 114 సార్లు ప్రకటించగా.. 227 మంది అందుకున్నారు. ఇందులో కేవలం 13 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. వైద్య విభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రదానం అక్టోబర్ 14 వరకు కొనసాగనుంది. మంగళవారం భౌతికశాస్త్రం, బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్య విభాగాల్లో విజేతలను ప్రకటిస్తారు. శుక్రవారం రోజున నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 14న అర్థశాస్త్రంలో నోబెల్ గ్రహీతల పేర్లను వెల్లడిస్తారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్తగా పేరుగాంచిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించినవారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11 లక్షల స్వీడిష్ క్రోనర్ (10 లక్షల డాలర్లు) నగదు అందుతుంది. వీటిని డిసెంబర్ 10న అవార్డు గ్రహీతలకు అందజేస్తారు.

# కాంగ్రెస్ తీసుకున్న ముఖాముఖిని కొనసాగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మల.. సూర్యాపేట కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని సూచించారు. మరోవైపు ముఖాముఖి కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రికి అర్జీలు పెట్టారు. మొత్తం 95 అర్జీలను మంత్రి తుమ్మల స్వీకరించారు. భూ సమస్యలు, ఉద్యోగాలు, పెన్షన్స్, ఇందిరమ్మ ఇల్లు, పలు సమస్యలపై మంత్రికి వినతి పత్రాలు అందాయి. కొన్ని సమస్యలపై వెంటనే కలెక్టర్లతో మాట్లాడి పరిష్కరిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. గాంధీభవన్‌కు వస్తే తమ సమస్యలు తీరతాయని ప్రజలు వస్తున్నారని తెలిపారు. 'మేం నిత్యం రైతుల్లోనే తిరుగుతున్నాం.. ప్రభుత్వంపై అసంతృప్తి ఉంటే మాకు నిరసన సెగ తాకేది కదా. తెలంగాణ ప్రభుత్వం లాంటి ప్రభుత్వం ఎక్కడైనా ఉంటే చూపించాలి.. అధికారం కోల్పోయిన బాధ ఒకరిది.. అధికారంలోకి రావాలనే బాధ ఇంకొకరిది.. తెలంగాణ రుణమాఫీ మోదీకి కనిపించడం లేదా? 18 వేల కోట్ల రుణమాఫీ బీజేపీకి కనిపించడం లేదా? బీజేపీ పాలిత రాష్ట్రాలలో రుణమాఫీ చేసారా? రుణమాఫీ పూర్తి కాగానే రైతు భరోసా నిధులు వేస్తాం అని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి..

(మొదటి పేజీ తరువాయి)

మురుగుశుద్ధి వ్యవస్థనే ఉందని, అది ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. హైదరాబాద్ సమీప పురపాలక సంఘాల్లోనూ సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదని కేంద్ర మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ప్రజల జీవన ప్రమాణాలు ప్రపంచ స్థాయి నగరంలో మాదిరి ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో 100 శాతం ద్రవ వ్యర్థాల శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలతో కలుపుకొని కలిపి 7,444 కి.మీ.మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్లు ఖట్టర్‌కు సీఎం తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సహాయం చేయడం లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులివ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

# వరదనష్టం పనులకు రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో భారీ వర్షాలతో దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులకు రూ.11,713.49 కోట్లు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. తెలంగాణలో ఆగస్టు 31 నుంచి నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపాయని సీఎం తెలిపారు. 37 మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షకుపైగా పశువులు, ఇతర మూగ జీవాలు మృతిచెందాయని, 4.15 లక్షల ఎకరాల్లో పంటతో పాటు రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు, చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయని కేంద్ర మంత్రి షా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులను తాము వెంటనే చేపట్టామని వివరించారు. ఆయా పనులకు రూ.5,438 కోట్లు విడుదల చేయాలని సెప్టెంబరు రెండో తేదీన తాను లేఖ రాసిన విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో పంట, ఇతర నష్టాలపై కేంద్ర బృందం పర్యటించి మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.11,713 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సెప్టెంబరు 30వ తేదీన నివేదిక సమర్పించిందని సీఎం తెలిపారు. ఆ నిధులు పునరుద్ధరణ, మరమ్మతుల పనులకు ఎంతమాత్రం సరిపోవని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిని ఇప్పటి వరకు విడుదల చేయనందున వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని కోరారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు రూ.416.80 కోట్లను కేంద్రం విడుదల చేసిందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులను గతంలో ఎస్‌డీఆర్ఎఫ్ పనులకు సంబంధించిన నిధులు ఉపయోగానికి ముడిపెట్టవద్దని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు సంబంధించిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే వ్యయం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డబ్ల్యూఈ) జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈలో తిరిగి చేర్చాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎల్ డబ్ల్యూఈ ప్రభావిత రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో తెలంగాణకు సరిహద్దు ఉండటంతో రాష్ట్ర భద్రతపైన మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తెలంగాణ సరిహద్దుల్లోని ములుగు జిల్లా పేరూరు, ములుగు, కన్నాయిగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల, మహ ముత్తారం, కాటారం వంటి పోలీస్ స్టేషన్లను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పోలీస్ శాఖ కొత్తగా నియమితులైన పోలీసు సిబ్బందికి గ్రేహౌండ్స్ ద్వారా తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2024-25 సంవత్సరంలో ఈ రకమైన శిక్షణకు అదనపు బడ్జెట్ రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పోలీసు దళాలను తీర్చిదిద్దే పనులకు ఉద్దేశించిన ప్రత్యేక మౌలికవసతుల పథకం (ఎస్ఐఎస్)కు తెలంగాణకు కేవలం రూ.6.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, అవి ఏమాత్రం సరిపోవని అదనంగా రూ.23.56 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పదిలోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ ÷-లకెయిమ్ చేసుకుంటున్నందున, వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణకు అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే కేటాయించారని తెలిపారు. ఐపీఎస్ క్యాడర్‌పై రివ్యూ వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రిని సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ జితేందర్ పాల్గొన్నారు.

## కాశ్మీర్, హర్యానాల

# ఫలితాలపై ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

ఈవీఎంలో నమోదైన ఓట్ల పక్రియ ప్రారంభమవుతుందని సీఈసీ పేర్కొంది. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు మూడు విడతలుగా.. సెప్టెంబర్ 18, సెప్టెంబర్ 25, అక్టోబర్ 1వ తేదీన జరిగాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 60 శాతంపైగా ఓటింగ్ నమోదయింది. దాదాపు దశాబ్దం తర్వాత జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. అదీకూడా ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి.

నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ ఓటర్ ఏ పార్టీకి పట్టం కడతాడనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక ఎగ్జిట్ పోల్స్‌లో మాత్రం నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి విజయావకాశాలున్నాయని స్పష్టం చేశాయి. లేకుంటే రాష్ట్రంలో హంగ్ ప్రభుత్వం కొలువు తీరే అవకాశముందని పేర్కొంది.

ఇక హర్యానాలో సైతం 90 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలు ఒకే విడతలో అంటే.. అక్టోబర్ 5న జరిగాయి. ఈ ఎన్నికల్లో 60 శాతానికిపైగా పోలింగ్ నమోదయింది. గతంలో హర్యానాలో వరుసగా జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తన సత్తా చాటింది. అయితే ఈ సారి ఎగ్జిట్ పోల్స్ మాత్రం కాంగ్రెస్ పార్టీ అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటుందని స్పష్టం చేస్తున్నాయి. ఒకవేళ.. అదే జరిగితే మాత్రం రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంటామని బీజేపీ అగ్రనేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మరి హర్యానా ఓటరు ఎవరి పట్టం కట్టేది.. బీజేపీకా? లేకుంటే కాంగ్రెస్ పార్టీకా? అనేది మంగళవారం సాయంత్రం నాటికి తెలిపోనుందన్నది సుస్పష్టం. ఈ ఎన్నికల ఫలితాలు వెలువడిన కొద్ది రోజులకే మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు నగరా మోగనుంది. అందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తుంది. ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నవంబర్‌లో జరిగే అవకాశముందని సమాచారం.



## కిస్మత్పూర్‌లో శ్రీకృష్ణ దేవాలయం

# పునర్నిర్మాణం

**బండ్లగూడ, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):**
బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్పూర్‌లోని చారిత్రాత్మకమైన శ్రీకృష్ణదేవాలయ పునర్నిర్మాణంలో భాగంగా గాలి గోపురాల గడప పూజా కార్యక్రమాన్ని సోమవారం వేద పండితులను మంత్రోచ్చారణ మధ్య ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ లంకల నిఖిలా సంగారెడ్డి దంపతులతో పాటు గ్రామ పెద్దలు యువకులుఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 700 సంవత్సరాల చరిత్ర ఉన్న ఈ దేవాలయ పురన్ నిర్మాణంలో భాగంగా శ్రీకృష్ణ దేవాలయం తో పాటు రామాలయం శివాలయాన్ని నిర్మిస్తున్నారు అలాగే నాలుగు దిక్కుల గాలిగోపురాలను నిర్మిస్తున్నారు గాలిగోపురాల గడప పూజా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు

## చిల్కూరులో ఘనంగా

# శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### దుర్గామాతకు ప్రత్యేక పూజలు.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

**మొయినాబాద్ అక్టోబర్ 07, (నమస్తే ఉదయం):**
మండల పరిధిలోని చిలుకూరు ఇంద్రారెడ్డి కాలనీలో శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం రాత్రి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన దుర్గామాత అమ్మ వారి మండపంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

పూజలో ముఖ్య అతిథులుగా బిజెపి జిల్లా జిల్లా నాయకులు గున్నాల గోపాల్ రెడ్డి , మాజీ ఉపసర్పంచ్ ఆంద్రూ, సీనియర్ నాయకులు మంచిరేవుల శ్రీరాములు, మాజీ ఉపసర్పంచ్



నరసింహ గౌడ్ పాల్గొన్నారు. జిల్లా నాయకుడు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా గ్రామాలలో మాలాలు ధరించి ఎంతో భక్తి శ్రద్ధలతో అమ్మవారి పూజల్లో పాల్గొంటారని ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత లభిస్తుందని ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకోవాలని ఆయన అన్నారు.ఆ మాత అనుగ్రహముతో చిలుకూరు గ్రామ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన అన్నారు దేవి అమ్మవారి సేవలో ప్రతీ ఒక్కరూ నిమగ్నం కావాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో , చిలుకూరు గ్రామస్తులు కాలనీ వాసులు రాజు మహేష్ చారి ,తదితరులు పాల్గొన్నారు.




శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో దుర్గమాత, ఉత్సవాలలో పాల్గొన్న మహిళ భక్తులు

## భవాని కాలనీ శ్రీ ఉమామహేశ్వరి ఆలయంలో

# ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

### పారాయణం పట్టిస్తున్న భక్తులు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవాని కాలనీలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగు తున్నాయి. సోమవారం అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించి మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పారాయ ణం పట్టించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు నిర్వహించారు.

## జిల్లా సరిహద్దుల్లో పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ,

# వనపర్తి పోలీసుల సంయుక్త దాడి

### రూ.6,35,600 నగదు, 4 కార్లు,3 బైక్‌లు, 15 మొబైల్స్ స్వాధీనం

### 15 మంది అరెస్ట్, కేసు నమోదు



పేకాట ఆడుతున్న జూదరులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**గద్వాల ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** జోగుళాంబ గద్వాల్ జిల్లా సరిహద్దులో బీచుపల్లి కృష్ణ నది అవతలి వైపు రంగాపూర్ శివారులోని ఒక గోదాంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీస్‌లకు నమ్మదగిన సమచారం రాగా జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు ఆదేశాల మేరకు గద్వాల సీఐ నాగేశ్వర్ రెడ్డి ఆద్వర్యంలో ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ , ఎస్బి సిబ్బంది, మరియు వనపర్తి పోలీసులు సంయుక్తంగా పేకాట స్థావరంపై దాడి నిర్వహించి 15 మందిని అరెస్టు చేశారు.వారి నుంచి రూ.6,35,600 నగదు, 4 కార్లు,4బైక్ లు మరియు 15 మొబైల్స్ పోన్ లు స్వాధీనం చేసుకొని పెబ్బేరు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. కేసు నమోదు అయిన వారి వివరాలు పల్లె వెంకటయ్య - గుడ్డం దొడ్డి, ధరూర్, దౌలు - దౌధర్ పల్లి, గద్వాల్, గుంజ పల్లి వీరేష్, మట్టి పేట రాయచూర్, ఆంజనేయులు, పారుచర్ల, ధరూర్, అశోక్ - గద్వాల్, ఉప్పరి గోపాల్ - ఎర్రవల్లి, మద్ది లేటి, కొండేర్, ఎర్రవల్లి, జలీల్ భాషా, రాయచూర్, పాడ రామిరెడ్డి - ఎర్రవల్లి, సత్య స్వరూఫ్ - గద్వాల్, కూర్వ వీరన్న - కొండేరు, ఎర్రవల్లి, కృష్ణయ్య, రంగాపురం, పెబ్బేరు, వెంకటన్న, కొండేరు, ఎర్రవల్లి, నాగి రెడ్డి, చెలిమిల్ల, పెబ్బేరు, నరసింహా రెడ్డి , పెద్దొడ్డి, మల్దకల్ ఉన్నారు.

# ప్రపంచ శాంతి కోసం నిరంతర పోరాటాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):**
సామ్రాజ వాదానికి వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం వామపక్ష పార్టీలుగా నిరంతరం పోరాటాలు చేస్తామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు ఏ.వెంకటస్వామి బి.ఆంజనేయులు అన్నారు వామపక్ష పార్టీల అఖిల భారత కమిటీల పిలుపు మేరకు సోమవారం గద్వాలలోని పాత బస్టాండ్ లోని వైయస్సార్ చౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.




ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజా పై ఇజ్రాయిల్ దాడి చేసి నేటికి సంవత్సరం పూర్తి కావోస్తున్నప్పటికి సంప్రదింపుల ద్వారా శాంతి కోసం అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాలను అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్య వాద దేశాలు వమ్ము చేస్తున్నాయని విమర్శించారు ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షతో నిరంతరం ఇరాన్ పాలస్తీనా ఏమేన్ లేబనాన్ వంటి దేశాలపై నిరంతర దాడులకు పాల్పడుతూ అంతర్జాతీయ ఉద్రిక్తతలకు కారణమవుతుందని విమర్శించారు. అమెరికా ఫ్రాన్స్, జపాన్, జర్మనీ వంటి దేశాలు తెరవెనక ఉండి ప్రచ్ఛన్న ప్రత్యక్ష యుద్ధానికి కారణమవుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రాజకీయ సంక్షోభాలకు కారణమవుతున్నాయని విమర్శించారు. ప్రపంచంలో చమురు సహజ వనరులు ఉన్న దేశాలను తన అధీనంలోకి తెచ్చుకోవడం కోసం సామ్రాజవాదాల దేశాలు తృతీయ ప్రత్యామ్నాయ దేశాలు పేద దేశాలపై నిరంతర దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికే పాలస్తీనాలో ఇజ్రాయిల్ యుద్ధ కాంక్ష వల్ల సుమారు 8 శాతం జనాభా మరణించిందని లక్షలాది మంది పౌరులు ఆశ్రయం కోల్పోయారని కొందరు వికలాంగులుగా మారారని పర్యావరణం పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధాల ద్వారా ఆర్థిక సంక్షోభాలను సృష్టించి అమెరికా ప్రపంచాన్ని తన ఆధీనంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ప్రపంచ యుద్ధాల వల్ల భారతదేశంపై కూడా ప్రత్యక్ష పరోక్ష ప్రభావాలు పడుతున్నాయని దీని ప్రజలు గమనించాలని కోరారు. ప్రస్తుతం దేశంలో పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ నిత్యవసరల వస్తువుల ధరలకు ఈ యుద్ధాలే కారణమని ప్రపంచ యుద్ధాల వల్ల ఆయా దేశాలలో పనిచేస్తున్న భారతీయులు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోయి తిరిగి భారతదేశానికి వస్తే ఇక్కడ కూడా సంక్షోభాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. వామపక్ష పార్టీలుగా అంతర్జాతీయ దృక్పథంతో ప్రపంచ శాంతి కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న వామపక్ష పార్టీల ఉద్యమాలకు ప్రజలు కార్మికులు మేధావులు మద్దతునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, సీపీఐ, నాయకులు పరంజ్యోతి, వివి నరసింహ, ఉప్పేర్ నరసింహ, ఆశన్న, మస్తాన్ , వెంకట్రాములు,రామకృష్ణ నరేష్ మజ్జిగ ఆంజనేయులు, సత్య రాం సామేల్ విష్ణు నరేష్ రమేష్ సవారన్న తదితరులు పాల్గొన్నారు.

# మూసి పరిరక్షణ పేరుతో పేదల ఇళ్లను కూలుస్తున్న ప్రభుత్వం

### - సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** మూసి పరిరక్షణ పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చడం సమంజసం కాదని సిపిఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ ఆరోపించారు. సోమవారం సిపిఎం పార్టీ మైలార్ దేవుపల్లి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ శాఖ మహాసభ జిఎం కురుమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ... పార్టీ సభ్యులు తమ తమ నివాస ప్రాంతాల్లో. ప్రజల సమస్యల పైన పనిచేయాలన్నారు. భారతదేశంలోని బిజెపి మోడీ ప్రభుత్వం మతాల మధ్యన పెడుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని, పెంచినా నిత్యవసరాలు, పెరిగిన పంట గ్యాస్, పెట్రోలు తగ్గించడం కోసం పోరాటంలో పాల్గొనాలన్నారు. సుమారు. పది సంవత్సరాలు పాలన సాగించిన టిఆర్ఎస్. ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని ఇవ్వకుండా మొండి చేయి చూపిందని అన్నారు. ప్రస్తుతం అధికారులు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం. మూసి పరిరక్షణ పేరుతో. పేదల ఇండ్లు. కూల్చాలని



చూస్తుందని. చంద్రమోహన్ అన్నారు.

పేదలకు ఇండ్లు కేటాయించిన తర్వాతనే. పేదల జోలికి రావాలని. డిమాండ్ చేశారు నేతాజీ నగర్ శాఖ. కార్యదర్శిని కార్యదర్శిగా. జి మణెమ్మను ఎన్నుకొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు రాజేంద్రనగర్ కన్వీనర్ జె రుద్ర కుమార్ ,పార్టీ నాయకులు బాలస్వామి వెంకటస్వామి. మొగులయ్య, మధు మోహన్, జి అనసూయ, జ్యోతి, రేణుక, నాగమణి ,లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు .

## అత్తాపూర్ డివిజన్ గుమ్మకొండ కాలనీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు

# సర్వేను పరిశీలించిన ముఖ్యమంత్రి ఓఎస్‌డీ అజిత్ రెడ్డి

**రాజేంద్రనగర్, అక్టోబరు7(నమస్తే ఉదయం):**
ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల యొక్క పూర్తి వివరాలు సేకరించాలని ముఖ్యమంత్రి ఓ ఎస్ డి అజిత్ రెడ్డి అధికారులకు, సిబ్బందికి సూచించారు.

అత్తాపూర్ డివిజన్ పరిధిలోని గుమ్మకొండ కాలనీలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే చేస్తున్న తీరు తెన్నులను సోమవారం ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పరిశీలించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే చేస్తున్న విధానాన్ని ఆయన రెండు ఇండ్లకు వెళ్లి స్వయంగా పరిశీలించారు.

అనంతరం అజిత్ రెడ్డి మాట్లాడుతూ, కుటుంబ సభ్యుల వివరాలు పూర్తిగా తెలుసు కోవాలన్నారు. వారికి రేషన్ కార్డు ఉందా అని అడగాలన్నారు. ఫ్యామిలీ గుర్తింపు కార్డు ద్వారా ఆ కుటుంబానికి ఒక ఐడి కార్డు లభిస్తుందని తెలిపారు. ఒక ఇంట్లో ఎక్కువ కుటుంబాలు ఉన్నట్లయితే వారి కోరిక మేరకు విడివిడిగా వివరాలను సేకరించవచ్చన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డులో కుటుంబ సభ్యుల ఫోటోలు అందరూ దిగుతాం అంటే తీసుకోవచ్చని, లేనట్లయితే కుటుంబం యజమాని ఫోటో తీసుకోవాలన్నారు.




గుమ్మకొండ కాలనీ లో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక తదితరులు

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం. సంగీత గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జనరల్ న్యూస్ GENERAL NEWS
మంగళవారం 08, అక్టోబర్ 2024
నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక





## ప్రజలు సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మొదలగు సామాజిక విషయాలపై సోమవారం కేటిదొడ్డి మండలం నందిన్నె గ్రామంలో ఎస్ఐ బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ సెల్ ఫోన్ లో ఎలాంటి లింక్స్ వచ్చిన ఓపెన్ చేయరాదని బ్యాంకు రుణామాఫీ కి సంబంధించి ఎలాంటి విషయాలు తెలుసుకోవాలన్న డైరెక్టుగా బ్యాంకుకు వెళ్లి కనుకోవాలని సూచించారు. బ్యాంకుకు సంబంధించిన వివరాలను అపరిచిత వ్యక్తులు కాల్ చేస్తే ఎట్టి పరిస్థితుల్లో వారికి సమాచారం ఇవ్వరాదని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ, వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ... డ్రైవింగ్ చేయరాదని, రాష్ డ్రైవింగ్ చేయరాదని, మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ మహిళలు, యువకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 'అమ్మా.. లే.. అమ్మా'.. కంటతడి పెట్టిస్తోన్న వీడియో

**ఖమ్మం, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** 'అమ్మా.. లే.. అమ్మా' అంటూ ఓ కోతి పిల్ల తల్లి వద్ద తల్లడిల్లిన వీడియో కంటతడి పెట్టిస్తోంది. ఖమ్మం (D) సత్తుపల్లిలో కొందరు ఆహారంలో విషం కలిపి పెట్టడంతో కోతులు నురగలు కక్కుతూ కుప్పకూలాయి. 10 రోజులు కూడా నిండని ఓ కోతి పిల్ల తన తల్లి చనిపోయిందనే విషయం తెలియక ఏడ్చి ఏడ్చి కాసేపటికే అదీ ప్రాణాలు వదిలింది. అటవీశాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్లే 15 వానరాలు మరణించాయనే ఆరోపణలు వస్తున్నాయి.



మృతి చెందిన తల్లి కోతిపై ఏడుస్తున్న పిల్ల కోతి

## రూ. 2.25 లక్షల ఎల్ఓసి లెటర్‌ను అందజేసిన ఎమ్మెల్యే

**గద్వాల 9,అక్టోబర్ 6(కేటీదొడ్డి)(నమస్తే ఉదయం):** మండలం నందిన్నె గ్రామానికి చెందిన సాత్విక కుమెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన రూ. 2. 25 లక్షల ఎల్ఓసి లెటర్



ను సోమవారం గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి లబ్దిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గద్వాల తిమ్మప్ప, శ్రీరాములు, సవారన్న, వీరేష్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మల్దకల్ పంచాయతీ స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలి

### - సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** మల్దకల్ గ్రామ పంచాయతీ కి సంబంధించిన 2ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) కు వినతిపత్రం అందజేశారు. .



ఈసందర్భగా మల్దకల్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 98/బి లోని 2ఎకరాల స్థలం ఉందని, ఇది గత కొన్ని సంవ్సరాలుగా కోర్టులో కేసు నడుస్తుందని అయితే ప్రస్తుతం కొందరు పంచాయతీ నిధులు కాకుండా సొంత డబ్బులు వెచ్చించి పంచాయతీ స్థలంలో గ్రామం కోసం అంటు షాపులు కట్టి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూన్నట్లు తమ దృష్టికి వచ్చిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు.
గతంలో మా స్థలం అంటు కొందరు ప్రయత్నం చేసి కోర్టులకు వెళితే ఇప్పుడు ఏకంగా కబ్జాలకు కొందరు నాయకులు ప్రయత్నిస్తున్నారని తెలిసిందని పేర్కొన్నారు.

కావున జిల్లా కలెక్టర్ & అడిషనల్ కలెక్టర్లు (రెవెన్యూ, స్థానిక సంస్థలు) దీనిపైన సమగ్ర కార్యాచరణ చేసి అస్థలాలన్ని రక్షించడంతో పాటు ఒకవేళ ఎవరైనా కబ్జాలకు ప్రయత్నించినట్లు తేలితే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# దసరా పండుగ రోజు నిర్వహించే ర్యాలీకి బందోబస్తు ఏర్పాటు చేయాలి: సిక్కు సోదరులు

**రాజేంద్రనగర్, అక్టోబరు7(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ నౌ నెంబర్ సిఖ్ చావునీ ప్రాంతంలో గల గురుద్వారా బరంబలలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని సిక్కు సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయమని రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్, అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డిలను సోమవారం కలసి వినతి పత్రం అందజేసారు.

### భారీ ఊరేగింపు ఉంటుంది : చేతన్ సింగ్

దసరా రోజు సిఖ్ చావునీలో భారీగా ఊరేగింపు ఉంటుందని , దాదాపుగా 2000 మంది పాల్గొంటారని సిక్కు ల నాయకుడు చేతన్ సింగ్ తెలిపారు. గౌలిగూడ గురుద్వార్ నుండి అంబర్పేట్ గురుద్వార, అమీర్పేట్ గురుద్వార్ నుండి హైదరాబాద్ నలుమూలలో ఉన్న గురుద్వారాల నుండి భారీగా సిక్కులు ఈ ర్యాలీలో పాల్గొనబోతున్నారన్నారు.ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.
పోలీస్ అధికారులను కలసిన వారిలో నాయకులు హర్భజన్ సింగ్, శైలెందర్ సింగ్, హార్జీత్ సింగ్, జితేందర్ సింగ్, బలవంత్ సింగ్‌తో పాటు విద్యుత్ అధికారులతో పాటు పోలీసు అధికారులు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలను అందించాలన్నారు. విజయదశమి సందర్భంగా ప్రజలకు అన్ని విధాలుగా సంతోషంగా ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నామని చేతన్ సింగ్ తెలిపారు.



రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను కలిసి సన్మానిస్తున్న సిక్కు సోదరులు

# శాంతి భద్రతలకు సంబంధించిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే చర్యలు తీసుకోవాలి:జిల్లా ఎస్పీ టి.శ్రీనివాస రావు

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం పోలీసు స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుల పై వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ మండలాల నుంచి వచ్చిన 07 మంది బాధితుల నుంచి ఎస్పీ పిర్యాదులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన పిర్యాదుల పై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదుల పై వెంటనే చర్యలు చేపట్టాలని,విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోని, నివేదికను అందజేయాలని ఎస్పీ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి పిర్యాదులలో భార్య భర్తల గొడవకు సంబంధించి -01 ఫిర్యాదు, భూ వివాదాలు, గొడవలకు సంబందించి -02, పొలం రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బులు ఇవ్వడం లేదని-01, చీటింగ్ కు సంబంధించి -01, ఇతర అంశాలకు సంబంధించి-02 పిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు.




ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు


# బతుకమ్మ సంబరాలలో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని శృతి వనం వాకింగ్ మహిళాలు ఆధ్వర్యంలో లో నిర్వహించిన బతుకమ్మ సంబురాలలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు పూల మొక్కలను ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె బతుకమ్మ గౌరమ్మ కు ప్రత్యేక పూజలు చేసి నిర్వహించి, మహిళల తో కలిసి బతుకమ్మ పాటలతో సందడి చేశారు.
బండ్ల జ్యోతి మాట్లాడుతూ ...
తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంప్రదాయాలు
బతుకమ్మ సంబరాల్లో పండగను ఆడపడుచులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చే పండగని తెలిపారు.
రంగు రంగుల పూలతో బతుకమ్మను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మ పండగ ప్రాముఖ్యతను ఆడపడుచులతో పంచుకుంటూ, బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో కోలాటాలు బొడ్డెమ్మలు వేసి ఆడి పాడి బతుకమ్మ సంబరాలను సంతోషంగా జరుపుకున్నారు. బతుకమ్మ పండగ ముఖ్యంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవములలో భాగంగా గౌరమ్మ ఆశీస్సులతో ప్రజలను చల్లగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మహేశ్వరి సుధాకర్, మాజీ జెడ్పిటిసి పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, మహిళా నాయకురాలు రాధా, మహిళలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి





బండ్లగూడ దుర్గా దేవి కాలనీలో దుర్గామాత ప్రతిమ వద్ద భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ, భక్తి కార్యక్రమాల్లో పాల్గొన్న మహిళా భక్తులు

# బండ్లగూడ దుర్గాదేవి కాలనీలో ఘనంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

### భక్తి గీతాలతో సంగీత కార్యక్రమాలు

### భక్తులకు అన్నదాన కార్యక్రమం

**బండ్లగూడ, అక్టోబర్ 7(నమస్తే ఉదయం):** బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దుర్గాదేవి కాలనీలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత ప్రతిమ వద్ద పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా మండపం వద్ద ఉత్సవాల నిర్వాహకులు నిర్వహించిన "అమ్మ"పై అలరించిన పాటలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి.

భజన మండలి ప్రతినిధి లక్ష్మీకాంతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమాలలో గాయకులు భక్తి గీతాలు ఆలపించి భక్తులను ఎంతో పరవశింప చేశారు. కార్యక్రమంలో అమ్మ పాదాలను తమ పిల్లలు కడిగి అమ్మ రుణం తీర్చుకున్నారు. మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733